క్లుప్తంగా

పెద్ద చెరువు సమస్యను పరిష్కరించాలి



రిలే నిరాహారదీక్షల్లో కూర్చొన్న గ్రామస్తులు

ఆదోని రూరల్ : మండలంలోని పాండవగల్ గ్రామంలో 30 సంవత్సరాలుగా కోర్టులో పెండింగ్‌లో ఉన్న పెద్ద చెరువు సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలను ప్రారంభించిన సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశులు మండల కార్యదర్శి లింగన్న మాట్లాడారు. కోర్టులో ఉందనే నెపంతో పెద్ద చెరువు సమస్యను అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చెరువు సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆమరణ దీక్షలు చేపడతామని హెచ్చరించారు. దీక్షలో సీపీఎం నాయకులు రామాంజనేయులు, గోవిందు, అసీఫ్‌బాషా, నర్సిరెడ్డి, డీజే నర్సిరెడ్డి, హనుమంతరెడ్డి, యు.హనుమంతరెడ్డి, తాయన్న, తాయప్ప, ఎస్.షేక్షావలి కూర్చొన్నారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

ఆదోని సెంట్రల్: కార్పొరేటు, ప్రైవేట్ పాఠశాలల్లో చేపడుతున్న ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, జిల్లా కార్యదర్శి కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు అడ్మిషన్లకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతూ ఇష్టానుసారంగా ఫీజులు వసులు చేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎనిమిదిమంది విద్యార్థుల డీబార్

కోసిగి: మండల కేంద్రం కోసిగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ సప్లిమెంటరీ పరీక్షల్లో మాస్ కాపింగ్ పాల్పడిన ఎనిమది మంది విద్యార్థులు డిబార్ చేసినట్లు పరీక్షల చీఫ్ శ్రీనివాసులు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. స్థానిక కళాశాలలో శుక్రవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం సివిక్స్, మాథ్స్ పరీక్షలను ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి మురళీధర్ తనిఖీ చేశారు. సివిక్స్‌లో ఆరుగురు, మాథ్స్‌కు సంబంధించి ఇద్దరు విద్యార్థులు మాస్ కాపింగ్ పాల్పడుతూ పట్టుబడినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో విద్యుత్ కోతలు లేవు

ఆదోని టౌన్ : ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యుత్ కోతలు లేవని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న, మాతాశిశు సంరక్షణ కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ మాధవీలత శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఏదైనా మరమ్మతులు చేసే సమయంలో మాత్రమే కొంత సమయం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఏరియా ఆస్పత్రిలో మహిళలు, పురుషులు, చిన్నపిల్లల వార్డులలో రోగులు ఎలాంటి ఇబ్బందులు పడడం లేదన్నారు. సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లయితే వెంటనే ఇన్వెంటర్లు, జనరేటర్‌లు ఆన్ చేస్తామని డాక్టర్ మాధవీలత చెప్పారు. 24 గంటల పాటు కరెంట్ నిరంతరాయంగా సరఫరా అవుతుంది. అనుకోకుండా ఏదైనా జరిగినా వెంటనే జనరేటర్‌ను ఆన్ చేస్తామని చెప్పారు.

నీటి సమస్య పరిష్కరించాలి

మంత్రాలయం రూరల్: మాధవరం దళితవాడలో కొన్నేళ్లుగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకుడు జయరాజు ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం ఎదట నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలో డబ్బుల కొరత లేనప్పటికీ నీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహింస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు భాస్కర్‌యాదవ్, చిదానందం, దేవపుత్ర పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని నదిచాగి గ్రామానికి చెందిన బసప్ప శాంతమ్మ కూతురు పదవ తరగతిలో 80శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగపు నాయకుడు ప్రదీప్‌రెడ్డికి ఆ కుటుంబం ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతుందని స్థానిక నాయకులు తెలిపారు. స్పందించిన ప్రదీప్‌రెడ్డి రూ. 10 వేలు ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఎంపీటీసీ లింగన్నగౌడ్, గ్రామ కార్యదర్శి శివప్ప చేతుల మీదుగా గ్రామ నాయకులు బసప్ప శాంతమ్మ అందజేశారు.

బరువు తగ్గకుంటేనే ముప్పే!

- తీరని సమస్యగా మారిన ఊబకాయం
- భయపెడుతున్న బీపీ, షుగర్ వ్యాధులు
- వాకింగ్ తప్పదంటున్న వైద్యులు



ఆర్ట్స్ కళాశాల మైదానంలో వాకింగ్ చేస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్ : ఆరోగ్యానికి సంబంధించి ఊబకాయం పెద్ద సమస్యగా మారింది. బరువు పెరిగిపోతున్నామని చాలామంది గాబరాపడుతున్నారు. వీరి పరిస్థితి వేసవిలో మరింత ఇబ్బందికరంగా మారింది. అదేవిధంగా బీపీ, షుగర్ వ్యాధులు భయపెడుతున్నాయి. దీంతో ఎలాగైనా బరువు తగ్గించుకోవాలని తపనపడుతున్నారు జనం. ఫిట్‌నెస్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. కొత్తకొత్త వంటకాలు, సరికొత్త రుచులకు అలవాటుపడి పెంచుకున్న బరువును తగ్గించుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. నేటి కంప్యూటర్ యుగంలో ఒత్తిడి మూలంగా మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. పరిష్కారానికి పడరానిపాట్లు పడుతున్నారు. ఇలాంటి మానసిక, దీర్ఘకాలిక వ్యాధులు, అధిక బరువుతో బాధపడే వారంతా వేసవిలో కొన్ని చిట్కాలు పాటిస్తే ఆరోగ్యం మనచేతుల్లోనే ఉంటుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బీపీ, షుగర్, గుండెపోటుతో గతేడాది(2022) 23 మంది మృతి చెందినట్లు రికార్డుల సమాచారం. అదేవిధంగా ఈ యేడాది ఐదుగురు మరిణించినట్లు రికార్డుల్లో నమోదయ్యాయి.

నడకతో బరువు తగ్గొచ్చు

ప్రస్తుత టెక్నాలజీ యుగంలో సమయాన్ని ఎన్నో రకాల పనులకు వెచ్చిస్తుంటారు. దీతో తీవ్రమైన ఒత్తిడికి లోనవుతుంటారు. నడకతో ఒత్తిడిని అధికమించవచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు. సాయంత్రం కంటే మార్నింగ్ వాక్ చాలా మంచిదని సూచిస్తున్నారు. ఉదయం స్వచ్ఛమైన వాతావరణంతో పాటు ఆక్సిజన్ స్థాయి అధికంగా ఉంటుంది. సున్నితంగా సూర్యకిరణాలు పడుతుంటే మనసుకు హాయినిస్తుంది. అయితే జాగింగ్ సమయంలో కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి అని నిపుణులు సూచిస్తున్నారు. నీరసం వచ్చే వరకు జాగింగ్ చేయడం ప్రమాదకరం అంటున్నారు. అందుబాటులో తాగు నీటిని ఉంచుకోవాలని సూచిస్తున్నారు.

ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి

ఎంతటి భోజనప్రియులైన వేసవికాలంలో కాస్త మోతాదు తగ్గించి ఆహారం తీసుకోవాలి. ఘన పదార్థాల కంటే ద్రవపదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. ఆకలి తక్కువగా ఉంటుంది. 15 నుంచి 20 నిమిషాలకోసారి నీటిని తాగాలి. రోజుకు ఐదు లీటర్ల వరకు నీటిని తీసుకుంటే బరువు తగ్గేందుకు అవకాశం ఉంటుంది. ఫ్రిడ్జ్‌లోని నీటికన్నా కుండలో నీటిని తాగడం ఉత్తమం.

ప్రాణయామం ఎంతో మేలు

వేసవిలో భానుడి ప్రతాపం ఉదయం 9 గంటల నుంచి మొదలవుతుంది. ఎండ తీవ్రతను తట్టుకోవాలంటే సరైన ఆహారం తీసుకోవాలి. నీరు ఎక్కువగా తాగాలి. నీటితో పాటు ప్రాణయామం చేస్తే కొద్ది వరకు ఎండవేడిమిని తట్టుకునే శక్తి కలుగుతుంది. ఉదయం 7 గంటల సమయంలో ప్రాణయామం రోజుకు ఐదు నిమిషాల పాటు చేయడం ఎంతో మేలు అని, ఆరోగ్యం పదిలంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

వాకింగ్.. జాగింగ్ ఉపయోగం

వాకింగ్ అరగంటపాటు చేయడంతో చెమట ఏర్పడి సాల్ట్ బయటకు వస్తుందని, దీంతో బీపీ తగ్గుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అంతేగాకుండా ఇన్సులిన్ రిలీజ్ అయ్యి షుగర్ కూడా తగ్గుతుందని, చెడు కొలెస్ట్రాల్ తగ్గించి బరువు తగ్గడానికి ఆస్కారం ఉంటుందని చెబుతున్నారు. పరుగుతో ఆరోగ్యంతో పాటు శరీరాకృతుల్లో మార్పులు వస్తాయంటున్నారు.పిరుదులు,తొడలు, పొట్ట చుట్టూ ఉండే కొవ్వు కరిగిపోతాయి.

రెగ్యులర్‌గా వాకింగ్ చేయాలి



ప్రతిఒక్కరూ రెగ్యులర్‌గా వాకింగ్ చేస్తే ఆరోగ్యానికి చాలా మంచిది. శరీర బరువుతో పాటు కొలెస్ట్రాల్, బీపీ, షుగర్ నియంత్రణలోకి వస్తాయి. గుండెపోటుకు గురయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో నడక చాలా ముఖ్యం. ప్రతిరోజూ ఉదయం అరగంట నుంచి గంటపాటు వాకింగ్ చేయడం ఎంతో ఉత్తమం.

– డాక్టర్ వెంకటేష్, ఎండీ.ఫిజీషియన్

ఆహార నియమాలు పాటించాలి



వేసవిలో ఆహార నియమాలు పాటించాలి. వేపుళ్లు, నూనె ఎక్కువగా ఉన్న వంటకాలను తీసుకోకుండా ఉండడం మంచిది. నీరు శాతం ఎక్కువగా ఉండే ద్రవ పదార్థాలు తీసుకోవాలి. వాకింగ్, జాగింగ్ వ్యాయామం చేసే సమయంలో నీరసం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అతిగా వ్యాయామం చేయరాదు. ఎండలో వాకింగ్ మంచిది కాదు.

– క్రిష్ణమూర్తి, కంటి వైద్యనిపుణులు

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీడీఓ

ఆదోని రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీకి రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఈ మేరకు చేపట్టిన పనులు వేగంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఎంపీడీఓ గీతావాణి మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలో పర్యటించి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా ప్రజల విన్నపం మేరకు చేపట్టిన సీసీ రోడ్లను పరిశీలించారు. అనంతరం మనబడి–నాడునేడు పనులు, సిటిజన్ అవుట్‌రీచ్ ప్రోగ్రాం (సీవోపీ) పనులను పరిశీలించారు. తదనంతరం గ్రామ సచివాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు, ఆమె వెంట పంచాయతీరాజ్ ఏఈ మాలిక్‌బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, పంచాయతీ కార్యదర్శి క్రిష్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

ఆదోని రూరల్ : పట్టణంలోని బావాజీపేటలో శుక్రవారం దాడులు చేయగా బోయ గుంటమ్మ వద్ద ఉన్న 144 ఓసీ డీలక్స్ విస్కీ కర్ణాటక మద్యం ప్యాకెట్లు గుర్తించినట్లు సెబ్ సీఐ హరిక్రిష్ణ తెలిపారు. ఆ మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యాన్ని కలిగి ఉన్నా, తరలించినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు.

బడి బయట పిల్లలపై సర్వే పూర్తి చేయండి



మాట్లాడుతున్న వేణుగోపాల్

కౌతాళం: ఐదేళ్ల నుంచి 18సంవత్సరాలు ఉన్న బడి బయట పిల్లల గురించి సమగ్రంగా సర్వేను పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష కర్నూల్ జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సీఆర్‌పీ, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కౌతాళం మండలం సర్వే విషయంలో వెనుకపడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసర్వేను కలిసికట్టుగా సమన్వయంతో పని చేయాలన్నారు. రెండు రోజుల్లోపు పూర్తి చేయాలని, లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. కౌతాళం, కోసిగి మండలాల్లో బడి బయట పిల్లలు ఎక్కువ ఉన్నారని, ఇప్పటికీ సర్వే చేయని వలంటీర్ల గురించి జిల్లా పరిషత్ సీఈఓ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షేమ పాలనతో సుస్థిరస్థానం



సంక్షేమ పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న ప్రదీప్‌రెడ్డి

కౌతాళం: సంక్షేమ పాలనతో పేదల హృదయాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిరస్థానం సంపాదించుకున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు ప్రదీప్‌రెడ్డి కొనియాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెండవ రోజు మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో పర్యటించారు. గ్రామంలో 250 ఇళ్లను సందర్శించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న చలువతోనే ఎమ్మెల్యేలు, నాయకులు గడప గడప కార్యక్రమంలో ప్రజల నుంచి గౌరవ మర్యాదలు పొందుతున్నారన్నారు. నదిచాగి గ్రామంలో 1.52 కోట్లతో నాడు–నేడుతో పాఠశాల మరమ్మతులతోపాటు అదనపు గదుల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. జల జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేస్తామన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో దాదాపు రూ.70 కోట్లతో ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో చేపట్టిన పనులు శూన్యమన్నారు. నీరు–చెట్టు కార్యక్రమంలో టీడీపీ నాయకులు దోచుకోవడం దాచుకోవడం చేశారని ఆరోపించారు. జన్మభూమి కమిటీ ఏర్పాటు చేసి పింఛన్ల ఇవ్వడంలో పేదలకు అన్యాయం చేయడం జరిగిందని దుయ్యబట్టారు. నల్గురు అన్నదమ్ములు ఒకే ఇంట్లో ఉన్నామని ఇంటి పట్టాలు ఇవ్వాలని సిద్దమ్మ కోరగా వారంలోపు ఇద్దరికి పొజిషన్ పట్టాలు ఇవ్వాలని ఆర్ఐకి సూచించారు. తమ ఇంటి వద్ద ఉన్న కాలనీలో విద్యుత్ స్తంభం లేదని విద్యుత్ స్తంభం వేయాలని హనుమంతు కోరగా అక్కడే ఉన్న విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్, గ్రామ ఇన్‌ఛార్జి రామన్నగౌడ్, ఎంపీటీసీ లింగన్నగౌడ్, కోఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, ఏవో జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్ఐ రాజశేఖర్, గ్రామ కార్యదర్శి శివప్ప, నాయకులు అనిల్ కుమార్, పాండురంగారెడ్డి, కౌతాళం సర్పంచ్ పాల్ దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలకు దరఖాస్తు చేసుకోండి

పెద్దకడబూరు : రైతులు సబ్సిడీ విత్తనాల కోసం స్థానికంగా ఉన్న రైతు భరోసా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ వరప్రసాద్ సూచించారు. పెద్దకడబూరు వ్యవసాయ కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాలలో పిల్లిపెసర, జీలుగ, వేరుశనగ సబ్సిడీ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అయినట్లు తెలిపారు. మండలానికి 320క్వింటాళ్ల వేరుశనగ, 26క్వింటాళ్ల జీలుగ, 17క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు మంజూరు అయినట్లు తెలిపారు. వేరుశనగ ఒక క్వింటాం అసలు ధర రూ. 9,300కాగా 40శాతం రాయితీ రూ. 3720లు పోగా రూ. 5580 రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జీలుగ క్వింటాం రూ. 7,900 కాగా 50శాతం రాయితీ ఉంటుందన్నారు. పిల్లిపెసర క్వింటాం రూ. 9,700 కాగా 50శాతం రాయితీతో రైతులకు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనం ప్రారంభానికి సిద్ధం



సజ్జలగుడ్డంలో పూర్తయిన విలేజ్ క్లినిక్ భవనం

కోసిగి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తోంది. కోసిగి మండలంలోని 14 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ మంజూరు చేసింది. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.21లక్షల చొప్పున నిధులు కేటాయించారు. ఇందులో భాగంగా మండలంలోని సజ్జలగుడ్డం గ్రామంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణం పూర్తి కావచ్చింది. త్వరలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి చేతుల ప్రారంభించనున్నారు. ఇక పై గ్రామాల్లో వైద్యాధికారులు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందినున్నాయి.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అభిరూప్

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని మూడవ వార్డులోని సబ్ సెంటర్‌లో డాక్టర్ మనోజ్‌కుమార్, మూగలదొడ్డి, చిర్తనకల్లు గ్రామాల్లో డాక్టర్ అభిరూప్ శుక్రవారం ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం సబ్ సెంటర్‌లలో ఆయా పరిధిలోని గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించారు. పౌష్టికాహారంతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు.

చేపల పెంపకానికి వేలం



వేలం నిర్వహిస్తున్న నాగరాజు

కోసిగి: మండల కేంద్రం కోసిగి సమీపంలోని పులికనుమ రిజర్వాయర్‌లో మత్స్య సంపద (చేపల పెంపకం) చేసుకునేందుకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సహాయ మత్స్యశాఖ పర్యవేక్షకుడు నాగరాజు సమక్షంలో వేలం పాటలు పోటీ జరిగింది. కోసిగి, పెద్దకడబూరు, చింతకుంట, హంలికనుమ, పెద్దతుంబళం గ్రామాల నుంచి పాటాదారులు పాల్గొన్నారు. ప్రభుత్వం ఏడాదికి రూ. 61,884 నిర్ణయించగా రూ.80,100లకు కోసిగికి చెందిన పెండేకంటి ఈరన్న కైవసం చేసుకున్నాడు. కార్యక్రమంలో ఫిషరీస్ అసిస్టెంట్ చంద్రకళ ఉన్నారు.

పార్కులను తీర్చిదిద్దుదాం



ఎంఐజీ కాలనీలో పార్కును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోని టౌన్ : పట్టణంలోని పార్కులను మరింతగా అభివృద్ధి చేద్దామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎంఐజీ, ఎల్ఐజీ ప్రాంతాల్లోని పార్కులను ఆయన పరిశీలించారు. విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటీజన్లు, వృద్ధుల సౌకర్యార్థం పార్కుల్లో వసుతలు కల్పిస్తామన్నారు. పాత రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన పార్కును పరిశీలించారు. పట్టణంలో పార్కుల ఆవశ్యకత ఎంతగానో ఉందన్నారు. ఎన్‌జీవోస్ కాలనీలోని వాటర్ వర్క్స్ సెక్షన్‌కు సంబంధించి మస్టర్ పాయింట్‌ను తనిఖీ చేశారు. లైన్‌మెన్లు, సిబ్బంది హాజరు, చేయాల్సిన పనులపై అవగాహన కల్పించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జీల నిర్మాణానికి భూసేకరణ



భూముల వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఆదోని రూరల్ : ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి రైల్వే విన్నపం మేరకు సానుకూలంగా స్పందించిన రైల్వేశాఖ మూడు ఫ్లై ఓవర్ బ్రిడ్జిలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రెండు రోజులుగా ఆదోని రెవెన్యూ అధికారులు, రైల్వే శాఖ ఇంజినీర్లు భూసేకరణపై కసరత్తు చేపట్టారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఆర్ఐ జయరామిరెడ్డి, రైల్వేశాఖ ఇంజినీర్లు భూసేకరణ పనులు ప్రారంభించారు. ఆదోని పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రి గేటు వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణను పరిశీలించారు. అనంతరం కడితోట, కుప్పగల్ గ్రామాల్లో ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలకి భూమి సేకరణ పనులు వేగవంతం చేసినట్లు తహసీల్దార్ చెప్పారు. వీరి వెంట మండల సర్వేయర్ వెంకటరమణ, వీఆర్వోలు, సెక్రటరీలు, రైల్వేశాఖ అధికారులు పాల్గొన్నారు.

అందుబాటులో ఆధార్ సేవలు

- ప్రభుత్వ ఆధార్ కేంద్రాలతో అవినీతికి చెక్
- నామమాత్రపు ఫీజులతో సేవలు
- విద్యార్థుల కోసం పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలు



ఆధార్ కేంద్రంలో వివరాలు నమోదు చేస్తున్న అధికారి

మద్దికెర: గతంలో ఆధార్ కేంద్రాలు ప్రైవేట్ వ్యక్తుల తో నిర్వహించడంతో మార్పులు, చేర్పులు చేసే అనర్హులు కూడా సంక్షేమ పథకాలు పొందేందుకు అవకాశాలు ఎక్కువగా ఉండేవి. కొందరు ఆధార్ కేంద్రాల నిర్వాహకులు అవినీతికి పాల్పడడంతో అధికారులు దాడులు నిర్వహించి వాటిని రద్దు చేశారు. ప్రజలు ఆధార్ నమోదు కోసం ఇబ్బందులు పడకూడదని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి మండల కేంద్రంలోని ఒక సచివాలయంలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు తీరడంతో పాటు అవినీతికి చెక్ పడింది. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మండలానికో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి నామమాత్రపు ఫీజులతో ఆధార్‌లో మార్పులు చేర్పులు వంటి సేవందిస్తున్నారు. గతంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో మార్పులు, చేర్పులు చేసుకోడానికి దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బందులు పడేవారు. అంతేగాక వ్యవప్రయాసలు పడలేక వాయిదా వేసుకుంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో పొందలేకపోయేవారు. ప్రస్తుతం మండల కేంద్రాల్లోని సచివాలయాల్లో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి వాటిలో దాదాపు 740 సేవలను నామమాత్రపు ఫీజులకే అందించేందుకు చర్యలు చేపట్టారు. దీనివల్ల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఉన్నచోటే పనులు చక్కబెట్టుకోవచ్చు.

విద్యార్థుల కోసం ప్రత్యేక శిబిరాలు

రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకానికి ఆధార్ తప్పనిసరి కావడంతో పాఠశాలల విద్యార్థులు ఆధార్ కేంద్రం చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోకుండా పాఠశాల ల్లోనే ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ఆధార్ నమోదు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాస తప్పింది



మా పిల్లలు ఇద్దరు ఇంజినీరింగ్ చదువుతున్నారు. ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ లింక్ కాకపోవడంతో ప్రభుత్వ పథకాలు, నా భార్యకు పొదుపు రుణాలు మంజూరు కాక ఇబ్బందులు పడ్డాను. రోజుల తర బడి తిరిగినా పనికాలేదు. మండల కేంద్రంలోని సచివాయలంలో ఆధార్ శిబిరం ఏర్పాటు చేయడం వల్ల అక్కడికి వెళ్లిన గంటల వ్యవధిలోనే పని అయిపోయింది. దీంతో వ్యయ ప్రయాసలు తప్పాయి.

– రమేష్, మద్దికెర

త్వరగా పనిఅయిపోయింది



మా అబ్బాయికి ఆధార్ కార్డులో వివరాలు మార్పులు చేసుకోవాలని పాఠశాలలో చెప్పడంతో రోజుల తరబడి తిరిగినా పని అయ్యేది కాదు. కానీ సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేసిన తరువాత కొద్ది సమయంలోనే పని పూర్తి కావడంతో బాధలు తప్పాయి.

– తిరుమలయ్య, ఎం.అగ్రహారం

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ప్రజలకు సత్వర సేవలు అందించడంతోపాటు అవినీతికి తావు లేకుండా సచివాలయాలలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. రోజుల తరబడి తిరగకుండా మండల కేంద్రంలోనే నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఆధార్ సవలకు సంబంధిత ధ్రువపత్రాలు ఆన్‌లైన్‌లో నమోదుచేసిన తరువాతే వివరాలు అప్‌డేట్ అవుతాయి.

– నాగరాజు, తహసీల్దార్, మద్దికెర

కుక్కల పట్టివేత



కౌతాళంలో కుక్కల్ని పట్టుకుంటున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రం కౌతాళంలో కుక్కల పట్టివేత కార్యక్రమానికి శుక్రవారం అధికారులు శ్రీకారం చుట్టారు. ఇటీవల కుక్కల దాడుల్లో చిన్న పిల్లలు గాయాలకు గురవుతున్న విషయం తెలిసిందే. ఒక్క రోజే 132 కుక్కల్ని పట్టుకున్నట్లు సర్పంచ్ పాల్‌దినకర్, కార్యదర్శి నాగరాజు తెలిపారు. కుక్కలు పెంచుకునే వ్యక్తులు వాటిని ఇళ్ల లోనే ఉంచుకోవాలని వారు సూచించారు.